క్లుప్తంగా

లక్ష రుద్రాక్ష పూజ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

అమలాపురం టౌన్: స్థానిక శివాలయం రోడ్డులో సర్వ మంగళ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసంలో నిర్వహించనున్న లక్ష రుద్రాక్ష పూజ ఆహ్వాన పత్రికలను స్థానిక చందన బ్రదర్స్ నగలు, వస్త్రాలయ మేనేజర్ దొంతంశెట్టి శ్రీధర్ మంగళవారం ఆవిష్కరించారు. డిసెంబర్ 10వ తేదీన లక్ష రుద్రాక్ష పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వాడ్రేవు శ్రీనివాసరావు, ఇవటూరి సుబ్రహ్మణ్యం, కాళ్లకూరి బుజ్జి, కాలే సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల వసతి గృహాలకు రూ.35 వేల విరాళం



ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవికి విరాళాన్ని అందిస్తున్న దాతలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అర్చకుల వసతి గృహాలకు కాకినాడకు చెందిన కోశె వెంకటరామసీత, వారి కుమారులు రూ.35 వేలు విరాళంగా సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతా దేవికి ఆలయంలో మంగళవారం అందించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలకు ఆహ్వానం



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుకు దసరా చెడీ తాలింఖానా ఆహ్వాన ప్రతాన్ని అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురంలో బుధవారం జరగనున్న దసరా చెడీ తాలింఖానా ఊరేగింపులకు హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లను మహిపాల వీధి అబ్బిరెడ్డి చెడీ తాలింఖానా కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. ఎమ్మెల్సీల ఇళ్లకు వెళ్లి ఆహ్వానించడంతో పాటు వారిని సత్కరించారు. ఆహ్వానించిన వారిలో కమిటీ ప్రతినిధులు అబ్బిరెడ్డి సురేష్, దూడల ఫణి, అబ్బిరెడ్డి మల్లేష్ తదితరులున్నారు.

ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీలు



ఆర్డీవో కేశవ వర్ధనరెడ్డిని కలిసిన డీఎస్పీలు అంబికా ప్రసాద్, రమణ

అమలాపురం టౌన్: అమలాపురం రెవెన్యూ డివిజన్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన జి.కేశవ వర్ధనరెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో అమలాపురం, కొత్తపేట డీఎస్పీలు ఎం.అంబికా ప్రసాద్, కేవీ రమణలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీవోకు పూలకుండీలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కొద్దిసేపు డివిజన్‌లోని శాంతి భద్రతల గురించి చర్చించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

అమలాపురం టౌన్: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పేరి కామేశ్వరరావును టీటీడీ ఎస్వీబీసీ సలహాదారు అడపా దుర్గ సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ మేరకు అడపా దుర్గ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అంబాజీపేటలోని పీకేరావు స్వగృహంలో ఆయనను అభినందించానన్నారు. పీకేరావుకు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడంపై సినీనటుడు పుష్ప సురేష్‌శర్మ, బ్రాహ్మణ సంఘ నాయకులు ఆకొండి మహేష్, పెద్దంటి తంబి, కాళ్లకూరి కామేష్‌శర్మలు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా నక్షత్ర పూజలు



భీమనపల్లిలో ప్రత్యేక అలంకరణలో భూసమేత వేంకటేశ్వర స్వామి

ఉప్పలగుప్తం: మండల పరిధిలోని భీమనపల్లి భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



మురమళ్లలో రజత చీరలో భద్రకాళి అమ్మవారు



రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు



సన్నవిల్లిలో పండ్లతో అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



వానపల్లిపాలెంలో ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు



యానాంలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో లలితాదేవి

ఘనంగా విజయదశమి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఊరూరా అమ్మవారి ఊరేగింపులు

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు భక్తులకు రజిత చీరలో దర్శనమిచ్చారు. దాత తమ్ము రత్నం విరాళంగా అందజేసిన రజిత చీరను అమ్మవారికి అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో జమ్మి చెట్టు వద్ద శమీ పూజ పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఘనంగా నిర్వహించారు.

దుర్గాదేవిని దర్శించుకున్న ఎంపీ అనురాధ

అల్లవరం: విజయదశమి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని గోడితిప్ప సెంటర్‌లో కొలువైన్న విజయదుర్గ అమ్మవారిని ఎంపీ అనురాధ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోడసకుర్రులో దసరా ఉత్సవాలు అంబరాన్ని అంటాయి. ఏనుగు వాహనంపై బేతాళ స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. రాజపాలెంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ విజయదుర్గా దేవిని దర్శించుకుని పూజలు చేశారు.

ముమ్మిడివరం: నియోజకవర్గంలో దశమి శరన్నవ రాత్రుల ముగింపు ఉత్సవాలు అత్యంత వైభవపేతంగా నిర్వహించారు. గత తొమ్మిది రోజుల పాటు వాడవాడలా చలువ పందిళ్లు వేసి వేప, మామిడి తోరణాలు కట్టి అమ్మవారిని ప్రతిష్ఠించి వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజైన మంగళవారం శమీ పూజ నిర్వహించారు. ముమ్మిడివరం, గోదశివారిపాలెం, చినకొత్త లంకల్లో అన్న సమారాధన చేశారు.

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి అమ్మవారి ఆలయంలో చివరిరోజు మంగళవారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వెష్ణవీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. స్థానిక సావరం బైపాస్ రోడ్డులో వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన చేశారు. అమలాపురం నల్లా వీధి రామాలయం వద్ద ప్రతిష్ఠించిన విజయదుర్గ అమ్మవారికి భక్తులు 108 రకాల పిండివంటలతో మహా నైవేద్యం సమర్పించారు. బాజా భజంత్రీల నడుమ ఊరేగింపుగా పిండి వంటలను అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



విజయదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ అనురాధ

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి, చినగాడవిల్లి, వానపల్లిపాలెం, కిత్తనచెరువు, చినగాడవిల్లి, సన్నవిల్లి గ్రామాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించి కుంకుమ పూజలు, జమ్మిపూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. పలుచోట్ల అమ్మవారి ఊరేగింపులు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తాళ్లరేవు: నీలపల్లిలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంచర్ల వెంకట నాగేశ్వరరావు, అన్నపూర్ణ దంపతులచే మంగళవారం నవ చండీ యాగాన్ని నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని జరిపారు. పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో పాల కనక దుర్గమ్మ అమ్మవారిని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నిప్పుల కుంపటిని భవానీలు భక్తిశ్రద్ధలతో తొక్కారు. పాత కోరంగి శివాలయంతో పాటు పలు ఆలయాల్లో శమీ పూజను నిర్వహించారు.

కాట్రేనికోన: మండలంలోని పల్లం, పోర, కొత్తపాలెం, మొల్లేటిమొగ, బలుసుతిప్ప, గచ్చకాయలపోర, చిర్రయానం తదితర గ్రామాల్లో అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. గచ్చకాయలపోరలో పోతరాజు పూజారితో పాటు ఇతర దేవతల పూజారులు, భక్తులు అగ్ని గుండంలో దిగి మూడుసార్లు నడిచారు.



ముమ్మిడివరం మార్కెట్ సెంటర్‌లో శమీ పూజ నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామం నారాయణరావుపేటలో ఉన్న అమ్మవారిని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, సర్పంచ్ చెల్లుబోయిన నాని, కౌన్సిలర్ దొమ్మేటి రాము, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం పట్టణంలోని గాంధీనగర్‌లో కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో శిరంగు మురళీకృష్ణ రూ.3200కు దక్కించుకున్నారు.

యానాం: పట్టణంలో కొలువైన లలితాదేవి అమ్మవారిని మంగళవారం రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. గోపాల్‌నగర్‌లోని శారదాదేవి అమ్మవారి ఆలయంలో శమీ పూజలు నిర్వహించారు. కనకాల పేటలో కొలువైన శ్రావణి అమ్మవారి ఆలయం, దొమ్మేటిపేట కనకదుర్గాదేవి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.



అమలాపురంలోని నల్లా వీధిలో విజయదుర్గమ్మకు పిండి వంటలతో నైవేద్యాన్ని సమర్పిస్తున్న ఆడపడుచులు



గ్రాంటు గ్రామంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ తదితరులు



బండారులంకలో దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ముమ్మిడివరం: బీజేపీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. వర్గీకరణ బిల్లుపై హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా మంగళవారం ముమ్మిడివరంలో పాదయాత్ర ప్రారంభించారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ వల్లూరి సత్తిబాబు, కన్వీనర్ సవరపు భైరవమూర్తి, యార్లగడ్డ సత్తిబాబు, నూటుకుర్తి సత్యనారాయణ, లంక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కృష్ణవేణి కల్యాణం సినిమా షూటింగ్ ప్రారంభం

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరంలో కృష్ణవేణి కల్యాణం సినిమా షూటింగ్ ముహూర్తం షాట్‌ను డీజీబీ కల్యాణ మండపం అధినేత ధూళిపూడి గొల్లబాబు కెమెరా స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. వర్ధమాన దర్శకుడు ఇళ్ల నాగప్రసాద్ స్వీయ దర్శకత్వంలో యాంద్ర నాగవేణి సమర్పణలో సినిమా చిత్రీకరిస్తున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమార్తె వివాహం చేయడానికి రైతు పడిన కష్టాన్ని తెలియజేస్తూ సినిమా తీస్తున్నట్లు కెమెరామెన్ ధూళిపూడి దొరబాబు తెలిపారు. కార్యక్రమంలో ఉంగరాల బూరిబాబు, విల్ల వీర, ధూళిపూడి సత్యం తదితరులు పాల్గొన్నారు.



కృష్ణవేణి కల్యాణం సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తున్న గొల్లబాబు తదితరులు

వైభవంగా బ్రహ్మోత్సవాలు

యానాం: పట్టణంలో కొలువైన శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామివారి 21వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అగ్నికుల క్షత్రియ సేవా సంఘం ఉత్సవదారులుగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, స్వామివారి ధ్రువమూర్తికి పంచామృతాభిషేకం, మంగళ ధ్వని, సువర్ణ పుష్పార్చన, ముత్యాలహార, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

సీఎం రంగసామితో తిరుమురుగన్ భేటీ

యానాం: సీఎం రంగసామితో కారైకల్ నార్త్ నియోజకవర్గ ఎమ్మెల్యే తిరుమురుగన్ మంగళవారం భేటీ కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇటీవలి చంద్ర ప్రియాంక రాజీనామా చేయడంతో మంత్రివర్గంలో ఖాళీ ఏర్పడింది. తిరుమురుగన్‌కు మంత్రిగా అవకాశం ఇస్తారని విస్తృతంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సీఎం రంగసామిని ఆయన కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే భేటీలో కారైకల్‌లో ప్రస్తుత పరిస్థితులను తాను సీఎంకు వివరించినట్లు తిరుమురుగన్ తెలిపారు.

ఫీల్డ్ సూపర్‌వైజర్ ఫలితాల విడుదల

యానాం: డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ శాఖ ఈ నెల 22న నిర్వహించిన ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టుల ఫలితాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కార్యదర్శి ఎల్.కుమార్ మంగళవారం విడుదల చేశారు. యానాం నుంచి బేతాళం సత్యసాయిమనోజ్(ఓబీసీ), యడ్ల ధరణి(ఈడబ్ల్యూఎస్), చిలకలపూడి సాయిశ్రీమణివెంకట్(ఎంబీసీ) ఎంపికయ్యారు. మొత్తం 26 పోస్టులకు గాను పుదుచ్చేరి, యానాం, కారైకల్, మాహే రీజియన్‌ల నుంచి 2,877 మంది దరఖాస్తు చేసుకోగా 1,299 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు.

భవనాల వాస్తవ స్థితిని నమోదు చేయండి



అల్లవరంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కష్ణమోహన్

అల్లవరం: మండలంలోని 23 సచివాలయాలు పరిధిలో నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలు, నిర్మాణంలో ఉన్న భవనాల వాస్తవ స్థితిని నమోదు చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదేశాలు జారీ చేశారు. అల్లవరంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ సెంటర్ల వాస్తవ స్థితిని సంబంధిత అధికారి హ్యాండెండ్ ఓవర్ సర్టిఫికెట్, భవనం ఫొటోలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంతోష్ ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు అశోక్

అమలాపురం రూరల్: మండలంలోని రోళ్లపాలెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రాయుడు సత్తిబాబు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు కుడుపూడి అశోక్ నిత్యావసర సరకులు, దుస్తులు అందచేశారు. బాధితులను ఆయన మంగళవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వాసంశెట్టి సత్యనారాయణ, గుబ్బల నాగేశ్వరరావు, రాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయభాస్కర్‌కు శిఖామణి సాహితీ పురస్కారం

యానాం: కవి సంధ్య సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఏటా ఇచ్చే శిఖామణి సాహితీ పురస్కారానికి ప్రముఖ నాటక రచయిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ విజయభాస్కర్ ఎంపికయ్యారు. ఈ మేరకు కవిసంధ్య పురస్కార కమిటీ అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కవిత్వంలో యువ కవులకు ఇచ్చే శిఖామణి యువ పురస్కారానికి తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ సుంకర గోపాల్ ఎంపికయ్యారన్నారు. అక్టోబర్ 29న విశాఖ పౌర గ్రంథాలయంలో పురస్కారాలను అందజేయనున్నామన్నారు.

టవర్ ఎక్కాలంటే చి(చు)క్కులే

- అభివృద్ధికి నోచుకోని ఒబ్లిస్క్ టవర్
- కనీస సదుపాయాలు కరవు
- నిరాశతో వెనుదిరుగుతున్న పర్యాటకులు

యానాం: నియోజకవర్గ శివారు గ్రామం గిరియాంపేటలో ఒబ్లిస్క్ టవర్ నిర్మించారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో వుండే ఈఫిల్ టవర్‌ను పోలి ఉండే ఈ ఒబ్లిస్క్ టవర్ పర్యాటకంగా యానాంకు సెంటర్ ఆఫ్ ది ఎట్రాక్షన్ అవుతుందని అంతా భావించారు. అయితే అక్కడ సరైన నిర్వహణ లేకపోవడంతో పాటు కనీస సదుపాయాలు కరవవ్వడంతో పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. కనీసం లిఫ్ట్ కూడా పనిచేయకపోవడంతో వంద మీటర్లకు పైగా ఎత్తున్న టవర్‌ను నడిచే ఎక్కాల్సి రావడంతో పర్యాటకులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి.

అభివృద్ధికి ఆమడ దూరం

రూ.17.21 కోట్ల రిలయన్స్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులతో నిర్మించిన ఒబ్లిస్క్ టవర్‌ను 2015లో ప్రారంభించారు. 9,125 టన్నుల బరువుండే ఈ టవర్ ఎత్తు 333 అడుగులు(101.6 మీటర్లు). ఒబ్లిస్క్ టవర్ యానాం పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంత దూరం వెళ్లిన పర్యాటకులకు అక్కడ తాగడానికి మంచి నీరు కూడా లేని పరిస్థితి నెలకొంది. సుమారు వంద మీటర్ల ఎత్తున్న టవర్ పైభాగానికి వెళ్లడానికి లిఫ్ట్‌ను ఏర్పాటుచేశారు. అయితే గతేడాది నుంచి లిఫ్ట్ పనిచేయడం మానేసినా పర్యాటక శాఖ అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. దీంతో మెట్లు ఎక్కి, దిగలేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకులు సేద తీరేందుకు కనీసం బెంచీలు కూడా లేవంటున్నారు. టాయిలెట్స్ నిర్మించినా వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో ప్రస్తుతం అవి శిథిలస్థితికి చేరుకున్నాయంటున్నారు. ఒబ్లిస్క్ టవర్ చుట్టూ సుమారు 17 ఎకరాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉన్నా పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో టవర్ ఎక్కినవారికి చుట్టూ ముళ్ల కంపలే కనిపిస్తున్నాయి. దీనికి తోడు గతేడాది టవర్ ఎదురుగా వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేసినా పనులు అసంపూర్తిగా వదిలేశారు. విద్యుత్ లైట్లు సైతం వెలగడం లేదు. ఒబ్లిస్క్ టవర్ వద్ద పీడబ్ల్యూడీ శాఖ నిర్వహణ అత్యంత అధ్వానంగా ఉందని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు టవర్‌కు మెయింటినెన్స్ లేక పైభాగంలో ఇనుప ఊచలు తుప్పుపడుతుండటంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ సదుపాయాలు లేకపోయినా టవర్ చూసేందుకు ఫీజును మాత్రం వసూలు చేస్తున్నారని చెబుతున్నారు.



గిరియాంపేటలోని ఒబ్లిస్క్ టవర్



టవర్ ఎదురుగా అభివృద్ధి చేయకుండా వదిలేసిన ప్రాంతం

> **సదుపాయాలు కల్పించాలి**
>
> కోట్లాది రూపాయలతో నిర్మించిన ఒబ్లిస్క్ టవర్ వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి. టవర్ చుట్టూ ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి. సంబంధిత అధికారులు టవర్ నిర్వహణపై దృష్టి పెట్టాల్సిన అవసరముంది.
>
> – వంశీకృష్ణ, పర్యాటకుడు, కాకినాడ